# సునామీ

పోయిన వారం ఉడత సాయం పేరుతో ముచ్చటించుకుంటూ సునామీ గురించి కొంచెం మాట్లాడుకున్నాం. అది వ్రాసిన తరువాత ఇక్కడ కొన్ని సంఘటనలు జరిగినందువల్ల ఈసారి సునామీ పేరుతో వ్రాస్తున్నాను.

ప్రపంచంలో ప్రతిదేశం ఈ ప్రకృతి బీభత్సానికి విపరీతంగా స్పందించింది. బిలియన్ల డాలర్లు దెబ్బ తిన్న ప్రాంతాలకి సహాయనిమిత్తం వెడుతు న్నాయి. అమెరికా ప్రభుత్వం 350 మిలియన్లు ఇచ్చింది. అమెరికాలో అన్నీ ప్రైవేటే కనుక, పౌరులూ కంపెనీలూ ఇప్పటికే ఐదు వందల మిలియన్ల పైన ఇచ్చారు. ప్రజలనించీ కంపెనీల నించీ ఇంకా మిలియన్లలో వస్తున్నాయి. కొన్ని కంపెనీలు తాము ఇచ్చేవే కాకుండా, కంపెనీలో ప్రతి ఉద్యోగి ఇచ్చే చందాకీ మరంత కలిపి ఇస్తున్నాయి. అంటే ఒక రావు వంద డాలర్లు ఇస్తే ఆయన పనిచేశే కంపెనీ ఇంకో వంద కలిపి దాన్ని రెండొందలు చేస్తుందన్నమాట. ఇది ఒక్క అమెరికాలో జరుగుతున్న చందాల సేకరణ. ఆస్ట్రేలియా జపాన్‌లాటి ఎన్నో దేశాల్నించీ ఎంతో డబ్బు చందాల రూపంలో, మందుల రూపంలో, ఆహారం రూపంలో వస్తూనే వుంది.

ఈ వ్యాసం వ్రాస్తున్న సమయానికి 11 దేశాల్లో లక్షా యాభై వేల మంది చనిపోయారనీ ఇంకొక లక్ష దాకా కనపడటంలేదనీ వార్తలు వస్తు న్నాయి. ఈ లెఖ్కలు ఉజ్జాయింపులే అనీ, అసలు సంఖ్య ఇంకా ఎక్కువేననీ అంటున్నారు. ఇండొనీషియా అన్నిటిలోకీ బాగా దెబ్బతింటే, శ్రీలంక రెండవ స్థానంలో, ఇండియా మూడవ స్థానంలో వున్నాయి. ఇంత పెద్ద నష్టానికి డబ్బులు వాటంతటవే వస్తాయి. కానీ అక్కడ బాగా అవసరమయేవి ఇంకా చాల వున్నాయి. ముఖ్యంగా ఎంతోమంది డాక్టర్లూ నర్సులూ ఇతర వైద్య సహాయకులూ ఎన్నో వేలమంది కావాలి. కూలిపోయిన ఇళ్ళ క్రిందా, బ్రిడ్జీల క్రిందా మృత శరీరాలని బయటికి తీయగల కండబలం వున్న వాలంటీర్లు కావాలి. తల్లిదండ్రులని పోగొట్టుకుని అనాధలుగా మిగిలి బ్రతుకు భయం తో వణికిపోతూ, ఆకలితో అలమటిస్తున్న పసిపిల్లలని దగ్గరికి తీసుకుని ఆదరించేవాళ్ళు కావాలి. మందులూ ఆహార పదార్థాలూ బట్టలూ దుప్పట్లూ మొదలైనవి పంచటానికి మనుష్యులు కావాలి. ఎందరో మహానుభావులు కావాలి. దూరంగా వున్నవారు ధనసహాయం చేస్తే, దగ్గరవున్నవారికి కష్టాల్లో ఉన్నవారికి చేయి అందించే సువర్ణావకాశం. అలా సహాయంచేసే సదుద్దేశ్యం వున్న వారికీ, పని చేయగలిగే శక్తీ వున్నవారికీ, మానవసేవ చేద్దామని వుందనీ ధనసహాయం

కావాలనీ నాకు ఈమైల్ పంపించిన వారికీ ఇదే నా విన్నపం. ఏ ఆర్.ఎస్.ఎస్., రామకృష్ణా మిషన్, రెడ్‌క్రాస్‌లాటి సంస్థలనో సంప్రదించి వారి సహాయ కార్యక్రమాల్లో చేరటం అవసరం. అది మానవ ధర్మం. ఇక్కడినించీ అమెరికన్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు వందల్లో బయల్దేరి విమానాలు ఎక్కటం టీవీలో చూపిస్తున్నారు. 13000 మంది అమెరికన్ మిలటరీ సిబ్బంది ఆప్రాంతంలో సహాయ కార్యక్రమాల్లో వున్నారు. 90 హెలికాప్టర్‌లూ, ఎన్నో కార్గో షిప్పులూ అక్కడికి వెళ్ళాయి. ఇలా ఎన్నో దేశాలనించీ అక్కడికి జన సహాయం అందిస్తూనే వున్నారు.

0 0 0

నాలుగు రోజుల్కకితం ఆఫీసులో పనిచేసుకుంటుంటే ఒక ఈమైల్ వచ్చింది. మిత్రులు శంకర్రెడ్డిగారి దగ్గర్నించి. ఎయిడ్ ఇండియా, నెట్ వర్క్ ఆఫ ఆస్టిన్ అమెరికన్ ఆర్గనైజేషన్, ఆస్టిన్ ఏషియన్ అమెరికన్ ఛేంబర్ ఆఫ్ కామర్స్, అమెరికన్ రెడ్‌క్రాస్‌తో కలిసి సునామీ బాధితుల కోసం చేస్తున్న, చందా సేకరణకి వాలంటీర్లు కావాలని. వెంటనే నేను సాయం చేస్తానని ఈమైల్ పంపించాను. మర్నాడు అన్ని వివరాలూ వచ్చాయి. ఒకటి: ఆస్టిన్‌లో వున్న ఎనిమిది స్థానిక టీవీ కేంద్రాల్లోనూ ఒకటి బుధవారం మధ్యాహ్నం మూడు గంటలనించీ రాత్రి పదకొండు గంటలదాకా చేసే ఫండ్ రైజింగ్ కార్యక్రమానికి నన్ను రెండు గంటలు పనిచేయమని అడిగారు. రెండవది: శుక్రవారం సాయంత్రం ఆరు గంటలనించీ ఎనిమిది గంటలదాకా టౌన్ లేక్ దగ్గర ఒక చేతిలో కొవ్వొత్తీ, ఇంకో చేతిలో ప్లాస్టిక్ బక్కెట్టు పట్టుకుని చందా వసూళ్ళకి బయల్దేరటం. మూడోది: శనివారం ప్రొద్దున్న పది గంటల నించీ డౌన్‌టౌన్‌లో మళ్ళీ బకెట్లు పట్టుకుని చందాలు వసూలు చేయటం.

బుధవారం మొదటి పని పూర్తిచేశాక, గురువారం రాత్రి వ్రాస్తున్న వ్యాసం ఇది. ఇది వ్రాయటంలో నా ఉద్దేశ్యం ఇక్కడ ఈకార్యకమాలు ఎలా చేస్తారో చూపిద్దామని. శంకర్రెడ్డిగారు ఏ ఇరవై మందో వాలంటీర్లు వస్తార నుకుంటే యాభైమందికి పైగా రావటం, ఏసహాయం కావాలన్నా ముందుకు రావటనికి ఇంకా ఎంతోమంది సిద్ధంగా వుండటం, ఆయనికీ నాలాటివారికీ ఆశ్చర్యం కలిగించలేదు కానీ, ఆనందం కలిగించిన మాట వాస్తవం.

ఈ చందాల వసూలు కార్యక్రమం జరిపించింది మా ఊళ్ళోని ఒక పెద్ద టీవీ కేంద్రం. మధ్యాహ్నం మూడు గంటలనించీ ఐదు గంటలదాకా నా షిఫ్ట్. వాలంటీర్లు ఎక్కువమంది రాకపోతే ఇంకా ఎక్కువసేపు పని చేసేటట్టు ఒప్పందం. నేను అక్కడికి రెండూ నలభైకల్లా వెళ్ళాను. ప్రొడక్షన్ కంట్రోల్ ఆవిడ లిండా మా మొదటి బేచ్‌లో వున్న ఎనిమిదిమందికీ ఏమేం చేయాలో ఎలా చేయాలో వివరించింది. ఒకే వరుసలో ఎనిమిది ఫోన్లున్నాయి. చందాలు ఇచ్చేవారు ఫోన్ చేసినప్పుడు ముందు మొదటి ఫోన్ మ్రోగుతుంది.అది బిజీగా వున్నప్పుడు రెండవది. రెండూ బిజీ అయాక మూడవది. ఇలా ఎనిమిది ఫోనులు. మొదటి ఫోన్ దగ్గర ఒక తెల్లమ్మాయి కూర్చున్నది. రెండవ ఫోన్ దగ్గర స్నేహితురాలు రత్నగారు కూర్చున్నారు. ఆవిడని చూసి నేను ఆవిడ పక్కనే మూడో ఫోన్ దగ్గర కూర్చున్నాను. తర్వాత

ఐదుగురిలో ఇంకొక ఇండియన్, మిగతా వాళ్ళు చైనీస్, ఫిల్లిప్పిన్, తెల్ల అమెరికన్లూ కూర్చున్నారు. మేము మేడమీద బాల్కనీలాగా వున్న ప్లాట్‌ఫాం మీద కూర్చుంటే క్రింద హాల్లో ప్రోగ్రాములు సిద్ధం చేస్తున్న వాళ్ళందరూ కనపడుతున్నారు. న్యూస్ యాంకర్లు ఫ్రెడ్, జూడీలు ఇద్దరూ అక్కడే కంప్యూటర్‌లో చదువుతూ, వార్తలు తయారు చేసుకుంటున్నారు. 'జూడీ టీవీలో కన్నా బయటే బాగుందే!' అన్నారు రత్నగారు. 'అవును. కానీ ఫ్రెడ్ బయటికన్నా టీవీలోనే బాగుంటాడు' అన్నాను.

మామూలుగా జరిగే కార్యక్రమాలకి అంతరాయం లేకుండా చేస్తారీ ఫండ్ రైజింగ్ కార్యక్రమాలు. సరిగ్గా మూడు గంటల కార్యక్రమం మొదలు పెట్టే ముందు ఒక్క నిముషం సునామీ గురించీ, అక్కడ జరిగిన ప్రాణ నష్టం గురించీ ఫ్రెడ్ చెప్పి, అమెరికన్ రెడ్‌క్రాస్ కోసం ఈ చందాలు వసూలు చేయటం గురించి చెప్పాడు. కార్యక్రమం చూస్తున్న అందరినీ ఉదారంగా చందాలు ఇవ్వమని అర్థించాడు. ఒక పదిహేను సెకండ్లు సునామీ బాధితుల విడియో చూపించారు. అదయిన వెంటనే మామూలు కార్యక్రమాలు కొనసాగాయి. అయితే టీవీలో క్రింద టేపులో సహాయం అందివ్వమని అర్థిస్తూ, పిలవవలసిన ఫోన్ నెంబరు వేస్తున్నారు. వెంటనే మొదటి ఫోనూ, రెండోదీ మూడోదీ.. ఇలా అన్నీ మ్రోగుతున్నాయి. నేను ఫోన్ తీసుకోగానే ఒకావిడ ఇంత ఘోరం తన జీవిత కాలంలో చూడలేదనీ, వంద డాలర్లు ఇస్తాననీ అంది. ఆవిడ పేరూ, అడ్రసూ, ఫోన్ నెంబరూ తీసుకున్నాను. క్రెడిట్ కార్డు మీద ఇచ్చేటట్టయితే నెంబరు తీసుకోవటం చెక్ అయితే అది అమెరికన్ రెడ్‌క్రాస్ పేరున వ్రాసి పంపించవలసిన అడ్రస్ చెప్పటం. అంతే మేము చేయవలసిన పని.

ప్రతి పావుగంటకీ ఫ్రెడ్ లేదా జూడీ మా ముందు నుంచుని చందాలివ్వమని టీవీలో చెబుతున్నారు. మధ్యమధ్యలో సిటీ మేయర్‌లాటి వారుకూడా వచ్చి చెబుతున్నారు. మొదటి గంటలో మూడు వేల డాలర్లకి పైగా వచ్చింది తరవాత ప్రతి గంటా చకచకా పెరుగుతూనే వుంది. రాత్రి పదకొండు గంటలయేసరికీ యాభై వేల డాలర్లకి పైన వసూలయాయి!!

ఆ రెండు గంటల్లోనూ నేను చాల ఫోన్ కాల్స్ తీసుకున్నాను. వాటిల్లో మూడిటి గురించి చెప్పాలని వుంది.

ఒకాయన ఎంతో సహాయం చేయాలని వున్నదనీ, అనుకున్నంత చేయలేక పోతున్నాననీ చెప్పాడు. 'నాకు ఉద్యోగం పోయి సంవత్సరం పైన అయింది. ఆదాయం లేదు. అందుకుని ఎక్కువ ఇవ్వలేకపోతున్నాను. ఇరవై డాలర్లు ఇస్తున్నాను.. ఫరవాలేదు కదా... అంతకన్నా ఇచ్చే స్థితిలో లేను' అన్నాడు కొంచెం నొచ్చుకుంటూ.

'ఇండొనీషియా శ్రీలంకలాటి దేశాల్లో అమెరికన్ డాలర్ చాల కొనగలదు. మీరిచ్చే ఇరవై డాలర్లు కనీసం రెండు ప్రాణాలని వేరే సహాయం వచ్చేంత వరకూ నిలబెడతాయి. మీరు చేస్తున్నది మామూలు సహాయం కాదు' అన్నాను. అతను వెంటనే ఉత్సాహంగా అన్నాడు 'నా ఇరవై డాలర్లని అంతకన్నా మంచి పనికి ఖర్చుపెట్టగలనని అనుకోను' అన్నాడు.

ఇంకొకతను బాగా కోపంగా వున్నాడు. 'ప్రపంచంలో ఏం జరిగినా అమెరికానే ఎందుకు సహాయం చేయాలి. మిగతా దేశాలు ఏం చేస్తున్నాయి? అన్ని మిలియన్ల డాలర్లు మన దేశంలో ఎన్నో కార్యక్రమాలకి వినియోగించవచ్చు కదా... ఇక్కడే ఎంతోమంది కష్టపడుతుంటే అక్కడికి పంపించటం ఎందుకు?' అని నా మీద విరుచుకు పడ్డాడు. అతనితో నెమ్మదిగా, మర్యాదగా అన్నాను. 'అక్కడ జరిగిన ఈ ప్రకృతి బీభత్సం దాదాపు ఏడొందల ఏళ్ళల్లో ఇంత పెద్ద స్థాయిలో రాలేదుట. అందుకనే మన మందరం తలా ఒక చేయీ వేయటం. మీరు కూడా కాస్తో కూస్తో యిస్తే అక్కడొక ప్రాణం నిలబడుతుంది. అలాకాక అమెరికాలోనే ఇంకో సేవా కార్యక్రమానికి ఇస్తానంటే చెప్పండి. మీ చెక్కుని అలాగే రెడ్‌క్రాస్‌కి అందిస్తాం. మీరెలా చెబితే అలాగే' అన్నాను. అతను ఏమీ మాట్లాడలేదు. ఫోన్ పెట్టేశాడు. చందా ఏమీ ఇవ్వలేదు.

మూడవ సంఘటన మరిచిపోవటం కష్టం. ఒకావిడ స్పానిష్‌లో మాట్లాడటం మొదలుపెట్టింది. నేను మావాళ్ళని అడిగాను స్పానిష్ మాట్లాడేవాళ్ళు ఎవరన్నా వున్నారా అని. దురదృష్టవశాత్తూ అక్కడ ఎవరూ లేరు. నా పరిస్థితి అర్థం చేసుకుని, ఆవిడ వాళ్ళమ్మాయికి ఇచ్చింది ఫోన్‌ని. చిన్న పిల్ల. ఏడెనిమిది ఏళ్ళుంటాయేమో. ఇంగ్లీషులో మాట్లాడింది. వాళ్ళమ్మ స్పానిష్‌లో చెబుతుంటే ఈ పిల్ల నాతో ఇంగ్లీషులో చెబుతున్నది. అరవై డాలర్లకి చెక్కు పంపిస్తుందిట. అడ్రస్సు ఇచ్చాను. ఆ పిల్ల వాళ్ళమ్మతో ఏదో వాదిస్తున్నది. నాకేమీ అర్థంకాకపోయినా, ఈ అమ్మాయి వాళ్ళమ్మ వద్దంటున్న పనేదో చేస్తానంటున్నదనిపించింది.

అప్పుడే ఆ పిల్ల అంది 'ఐదు డాలర్లు ఇవ్వచ్చా? నేను ఇచ్చానుగా నువ్వు ఇవ్వటం ఎందుకు అంటున్నది మా అమ్మ. ఇది నేను దాచుకున్న డబ్బు. నా ఇష్టం. నేను టీవీలో చూశాను, అన్నీ పోగొట్టుకుని చిన్న పిల్లలు ఏడవటం. నాకివ్వాలని వుంది. ఐదు డాలర్లు తీసుకుంటారా?' అంది.

నాకు నిజంగానే ఒక్క నిమిషం నోటమాట రాలేదు. తేరుకుని అన్నాను 'తప్పకుండాను. నీ ఐదు డాలర్లు వాళ్ళకి ఐదు మిలియన్ డాలర్ల క్రింద లెఖ్ఖ. మంచి పని చేస్తున్నావ్. పంపించు' అన్నాను, ఆ చిన్న పిల్ల చేసిన పెద్ద పనిని మనస్ఫూర్తిగా మెచ్చుకుంటూ.

0 0 0